# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





### ❖ ధరణితోనే భూమికి రక్షణ

ఇప్పుడున్న ధరిణితోనే మా భూమికి రక్షణ ఉంటుంది. ఇంతకు ముందు పైసలు తీసుకొని భూమి రికార్డులు కూడా మార్చేవారు. ఇప్పుడు వేలిముద్ర ఉంటేనే రికార్డు బదిలీ అయితుంది. అలాగే రిజిస్ట్రేషన్ కూడా మీ సేవలో బుక్ చేసుకుంటే తొందరగా అయిపోతుంది. మధ్యవర్తులకు ఒక్కరూపాయి కూడా ఇవ్వకుండానే పని అయితుంది. ఇంతుకుముందు భూమి కొంటే తమ పేరిట చేయించుకునేందుకు కూడా అధికారులకు పైసలివ్వాల్సి వచ్చేది. ధరణితో అలాంటి రంది లేదు. ధరణిని తీసేస్తామని కాంగ్రెసోళ్లు అంటున్రు. ఇలా చేస్తే భూ సమస్యలు మరింత పెరుగుతాయి. కౌలు ఒప్పందానికి కూడా చట్టం తెస్తే అసలు పట్టాదారుకు నష్టం జరుగుతుంది.

**- వెల్మ రాజేశ్వర్‌రెడ్డి, రైతు, వెల్లుల్ల గ్రామం, మెట్‌పల్లి మండలం**



### ❖ రైతులకు పట్వారీలతో ఇబ్బందే

గతంలో పట్వారీ వ్యవస్థ ఉన్న సమయంలో భూమి పహానీ పత్రాల కోసం వారం రోజుల పాటు ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరగంగా తిరగంగా పహానీ పత్రాలు వచ్చేవి.. బ్యాంకు రుణాలు తీసుకోవాలన్న.. రెన్యువల్ చేయాలన్న పట్వారీని దొరికించుకుని చేతిలో లంచం పెడితేనే పహానీలు వచ్చేవి. ప్రస్తుతం సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ ప్రారంభించాక ఇబ్బందులు తొలగిపోయి ఆన్‌లైన్‌లో ధరణి పోర్టల్ సర్వే నంబర్, ఖాతా నంబర్‌తో ఎక్కడైనా ఆన్‌లైన్ పహానీ పత్రాలు నిమిషాల్లో అందుతున్నాయి. బ్యాంక్ పనులు ఒకే రోజులోనే పూర్తి అవుతున్నాయి. ప్రతిపక్షాలు ధరణి తొలగిస్తే మళ్లీ రైతులు ఇబ్బందుల పాలు కావడం తప్పదు.

**- బద్దం మహేందర్‌రెడ్డి, రైతు, భూషణరావుపేట, కథలాపూర్ మండలం**



### ❖ కౌలు దారు రికార్డులతో ఇబ్బంది

కౌలు దారు రికార్డుల వల్ల పట్టాదారులు, యజమానులు భయాందోళనకు గురయ్యే ప్రమాదముంది. రైతులకు వీలు కాని సమయాల్లో తన భూమిని ఇతరులకు కౌలుకు ఇస్తే రికార్డుల్లో నమోదు చేయడం వల్ల కొద్ది రోజులకు కోర్టులను ఆశ్రయిస్తే పట్టా దారులకు ప్రమాదకరంగా మారుతుంది. కౌలు దారు వ్యవస్థ వల్ల రైతులు భయందోళనకు గురైతరు. భూములు ఖాళీగా ఉంచుకోవడం నయం. మా భూములపై ఇతరులకు రికార్డుల్లో నమోదు చేయడం వంటివి జరిగితే ఊర్లళ్ల గొడవులు జరిగే అవకాశం ఉంటుంది. దీనివల్ల శాంత్రిభద్రతల సమస్యలు తలెత్తుతాయి. కౌలు దారు చట్టం తేవడమే కరెక్ట్ కాదు. అసలు కాంగ్రెస్ పార్టీ పనులే గట్లుంటయి. అయినా ధరణిని తొలగించాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావాలి కద. ఆ పార్టీ అధికారంలోకి రావడం కలె. ప్రజలు, రైతులు కేసీఆర్ సార్‌నే నమ్ముతున్నరు. కేసీఆర్ సారే అందరి సంక్షేమం గురించి ఆలోచించుతరు. తెలంగాణ తెచ్చినోళ్లతోనే రాష్ట్రం మరింత డెవలప్ ఐతది.

**-ముస్కు కృష్ణారెడ్డి, భూషణరావుపేట, కథలాపూర్ మండలం**

# ధరణి ఎత్తేస్తే దగానే

జగిత్యాల, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ భూములకు భద్రత కల్పించిన ధరణి పోర్టల్ తీసేస్తే మళ్లీ దగా తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా భూముల పరిరక్షణకు ఆధునిక టెక్నాలజీ వాడుతూ.. వివాదాలకు తావులేకుండా భూములకు రక్షణ కల్పిస్తున్న నేపథ్యంలో.. ముఖ్యమంత్రి కేసీఆర్ అదే పంథాను అనుసరించారని, ధరణిని తెచ్చి, భూ వివాదాలకు చరమగీతం పాడారని గుర్తు చేస్తున్నారు. నిజాం కాలం నాటి దస్త్రాలను ఆధునీకరించడంతోపాటు డిజిటలైజ్ చేశారని, భూ వివాదాలకు పరిష్కారం చూపారని చెబుతున్నారు. ధరణిలో ఎప్పటికప్పుడు మాడ్యుల్స్ తెస్తున్నారని, చిన్న చిన్న సమస్యలను కూడా అధిగమించి.. పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నారని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తూ.. అందుకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌డేట్ చేస్తూ. కబ్జాలకు గురైన ఎన్నోభూములకు విముక్తి కల్పించి.. అసలైన యజమానులకు న్యాయం చేస్తున్నారంటున్నారు. సమస్య ఏదైనా ఉంటే.. కలెక్టర్ పరిశీలించి పరిష్కరించే అధికారాన్ని కల్పించి, క్షేత్రస్థాయి అధికారులు పొరపాట్లు చేయకుండా ధరణి రూపకల్పన చేశారని స్పష్టం చేస్తున్నారు. ఓవైపు రాష్ట్రంలో అమలవుతున్న ధరణి పోర్టల్‌ను.. వివిధ రాష్ట్రాలు వచ్చి పరిశీలించి, ఇదే విధానాన్ని వివిధ రాష్ట్రాల్లో అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని ప్రశంసిస్తున్నారు. కాంగ్రెస్ రోజుకో తీరు చెబుతున్న మాటలపై ఆలోచన చేయాలని, మోసపోవద్దని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ధరణి రద్దు చేస్తామన్న కాంగ్రెస్‌పై అన్నదాతలు భగ్గుమంటున్నారు. ఈ విషయంలో వ్యతిరేకత వస్తున్నా ఏమాత్రం పట్టించుకోకుండా అదే తీరున ఒకరి వెనుక ఒకరు వ్యాఖ్యలు చేయడం చూస్తే రైతులను దగా చేసే పెద్ద కుట్ర దాగి ఉన్నదని మండిపడుతున్నారు. యాభై ఎనిమిదేండ్ల సమైక్య పాలనలో నలభై రెండేండ్లు కాంగ్రెస్, పదాహారేండ్లు టీడీపీ పాలన చేసినా.. ఏనాడూ తమ బాధలు పట్టించుకోలేదని గుర్తు చేస్తున్నారు. తమను ఆదుకునే దిశగా ఎన్నడూ కనీస చర్యలు తీసుకోలేదని, మళ్లీ ఇప్పుడు వచ్చి అరిగోస పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోతున్నారు. ధరణి తీసేస్తే మళ్లీ పాత రోజులు వస్తాయని, భూమలకు రక్షణ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ పట్వారీలు, వీఆర్‌వోలు వస్తారని, లంచగొండులు, పైరవీకారులు రాజ్యమేలుతారని, ఇక పైసలేనిదే ఏ పనికాదని, కొట్లాటలు మొదలవుతాయని భయపడుతున్నారు. అందుకే కాంగ్రెస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రానివ్వమని, తమను కాపాడుతున్న కేసీఆర్‌కే ఓటేసి గెలిపించుకుంటామని చెబుతున్నారు.

### పాత వ్యవస్థతో అన్నదాతకు తిప్పలే

- భూములకు రక్షణ కరువే
- మళ్లీ లంచగొండులు, దళారులదే రాజ్యం
- కొట్లాటలు, కేసుల చుట్టూ తిరుగుడే
- ధరణి పోర్టల్‌తోనే భూములకు విలువ
- వ్యవసాయ రంగ నిపుణుల అభిప్రాయం
- కాంగ్రెస్ మాటలపై ఆలోచన చేయాలని పిలుపు
- ఆ మోసకారి పార్టీని మేమే రద్దు చేస్తం
- బీఆర్‌ఎస్‌కే అండగా నిలుస్తం
- స్పష్టం చేసిన అన్నదాతలు



### ❖ ఈజీగా ధరణి ద్వారా రిజిస్ట్రేషన్లు

గతంలో గ్రామాల్లోని రైతుల భూములు చేర్పులు, మార్పులు, రిజిస్ట్రేషన్లు ఏవైనా సంబంధిత రెవెన్యూ అధికారుల కార్యాలయాలు చుట్టూ రైతులు చెప్పులు అరిగేలా తిరిగినా పరిష్కారమయ్యేవి కాకుండే. ఇప్పుడు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ధరణి ద్వారా రైతులు బ్యాంక్‌ల్లో పైసలు తీసినట్లు.. ఎసినంత ఈజీగా ధరణి ద్వారా భూముల రిజిస్ట్రేషన్లు క్షణాల్లో ఎక్కడ రూపాయి ఖర్చు లేదు. టైం కూడా వేస్ట్ కావడం లేదు. రైతులు నేరుగా తహసీల్ ఆఫీస్‌కు పోయి భూముల సమస్యలను నేరుగా అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. ఏ పథకం ఇవ్వాలన్నా ధరణిలోని భూముల వివరాలు చూసి అందులో ఎంత ఉంటే ఎంత ఇస్తర్రు. ధరణి ద్వారా రైతులకు భూ సమస్యలు ఏండ్లు, నెలలు కాకుండా క్షణాల్లో పరిష్కారం కావడంపై రైతులు ఆనందంగా ఉన్నారు.

**- క్యాతం సురేశ్‌రెడ్డి, మల్లాపూర్, మండలం, గ్రామం**



### ❖ అధికారుల చుట్టు తిరుగుడు తప్పింది

ఇంతకు ముందు గ్రామాల్లోని రైతుల భూ సమస్యలు పరిష్కారం కావాలంటే రెవెన్యూ సార్ల దగ్గరికి వెళ్లి రోజుల తరబడి తిరిగే పరిస్థితులు ఉండేవి. సీఎం కేసీఆర్ ధరణి పెట్టిన తర్వాత భూ సమస్యల పరిష్కారం కోసం సార్ల చుట్టూ తిరిగే తిప్పలు పూర్తిగా తగ్గిపోయాయి. ఇప్పుడు దర్జాగా రైతులు భూములు అమ్మినా, కొనుగోలు చేసినా తహసీల్దార్ చలాన్ కట్టి వెళ్లి పట్టుమని పది నిమిషాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకొని తిరిగి వస్తున్నారు. ఎక్కడ సైతం బయట పది రూపాయల ఖర్చు లేదు. .రోజుల తరబడి నిరీక్షణలు ఇప్పుడు రైతులకు లేదు. రిజిస్ట్రేషన్ పెట్టుకొని కూడా ఆ రోజు ఇంకేదైనా పని చేసుకునేంత ఈజీగా ఉంది.

**- మామిడి చిన్నారెడ్డి, మల్లాపూర్, మండలం, గ్రామం**




### ధరణి తీసేస్తే భూముల వివరాలు ఆగమే

విదేశాల్లో ఉన్న తమ భూమి వివరాలను ధరణి పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చు. గతంలో ఉన్న పట్వారీ వ్యవస్థలో తమ భూమి ఎవరు ఆక్రమించేవారో, ఎవరి పేరు మీద ఉందో, రిజిస్ట్రేషన్ చేసుకున్నారో తెలిసేది కాదు. కానీ ధరణి పోర్టల్ వల్ల మన వేలిముద్రతోనే భూముల వివరాలు, మన పేరు మీద ఉందా..? తెలుసుకోవచ్చు. ధరణి వల్ల దళారీ వ్యవస్థ మొత్తం పోయింది. కేసీఆర్ సర్కార్ రైతులకు, సామాన్యులకు ధరణి వల్ల లాభం చేశారు. భూముల వివరాలన్నీ ఆన్‌లైన్ చేయడం వల్ల సెల్‌ఫోన్‌లో కూడా ఆ వివరాలు తెలుసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో ఉండడంతో ఆఫీసుల చుట్టూ తిరగకుండానే అన్ని సంక్షేమ పథకాలు మంచిగా అందుతున్నయి. ఇంత మంచి పద్ధతిని కాంగ్రెసోళ్లు మారుస్తమంటున్రు. ధరణి తీసేస్తే భూముల రైతులు ఆగమవుతయి. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి సీఎం కేసీఆర్‌ను గెలిపించుకుంటం.

**-కొంగరి మల్లారెడ్డి, యువరైతు, గుల్లపేట (జగిత్యాల)**

### ❖ భూమాత వద్దు.. ధరణే ముద్దు

సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి వల్ల రైతులకు రామరాజ్యం కలిగింది.గతంలో రైతులు పల్లెల్లో వ్యవసాయ భూములు కొనాలంటే దళారీతో వ్యవహారం నడిచేది. గ్రామంలో అతడు చెప్పిందే వేదం. దీంతో రిజిస్ట్రేషన్లు పట్టణాల్లో చేయించుకునేవారు. అప్పుడు భూములు కొన్న వారికి ఎంతో నష్టం కలిగేది. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత మండలకేంద్రంలోనే భూములు రిజిస్ట్రేషన్ చేస్తుండడంతో పాటు దళారీల బెడద పోయింది. నేరుగా తాసీల్దార్ వద్దకు పోయి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. సాయంత్రంలోగా భూమిని మన పేరుపై ఆన్లైన్లో సుకోవచ్చు. నెలలోగా మన ఇంటికి పాసుబుక్ వస్తుంది. ఇంత మంచి పథకాన్ని కాంగ్రెస్ వారు తీసివేస్తామంటే మళ్లీ దౌర్జన్యాలు తప్పవు. కాంగ్రెస్ పార్టీ వారు చేసే పనులకు రైతులు మళ్లీ భూములను అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుంది. అలాగే కౌలు దారు, అనుభవదారు తదితర 16 కాలమ్‌లు కూడా తెస్తమంటున్నరు. ఇలా చేస్తే గతంలో మాదిరిగా భూ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కౌలు రైతులు, భూ యజమానుల మధ్య చట్టపరంగా ఇక్కట్లు ఎదురవుతాయి. ఇలాంటి చట్టంతో భూ యజమానులతో పాటు కౌలు రైతులకు కూడా ఇబ్బందులు తప్పవు. ఇప్పుడున్న ధరణే ముద్దు.



**- నలిమెల శ్రీనివాస్‌రెడ్డి, రైతు, మెట్లచిట్టాపూర్ గ్రామం (మెట్‌పల్లి మండలం)**

### ❖ ధరణితోనే అందరికీ మేలు

తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన ధరణి వల్ల అందరికీ మేలు జరుగుతంది. దీని వల్ల రైతులు తమ భూములకు సంబంధించి అన్ని వివరాలను ప్రపంచంలో ఎక్కడ ఉన్నా చూసుకోవచ్చు. ధరణిని రద్దు చేయడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయి. పాత పద్ధతి తెస్తే అనేక భూముల సమస్యలు వస్తాయి. కౌల్దార్ చట్టం వల్ల కూడా రైతులకు ఇబ్బంది ఏర్పడుతుంది. కౌలు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రారు. దీని వల్ల వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకు పని లేకుండా పోతుంది. దీని వల్ల వ్యవసాయం సాగక అనేక మంది రైతులు తమ భూములను కౌలుకు ఇవ్వకుండా బీళ్లుగా ఉంచుకునే అవకాశం ఉంది. కాంగ్రెసోళ్లు కౌలు రైతులకు పని కల్పిద్దామని కాదు. వాళ్ల కడుపు మాడ్చే విధంగా మ్యానిఫెస్టో రూపొందించింది. కౌలు రైతులకు చేసేందుకు భూమి దొరకకపోతే వాళ్లు ఏం పని చేస్తరు. ఎట్ల బతుకుతరు. వాళ్ల కుటుంబాలు ఏం కావాలె, సీఎం కేసీఆర్ మాత్రమే రైతులు గురించి ఆలోచించుతరు. మేమందరం ఆ పార్టీకే మద్దతిస్తం.



**- నీలగిరి తిర్మల్‌రెడ్డి, రైతు, పెగడపల్లి మండల కేంద్రం**